
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
శుక్రవారం 20 మార్చి 2026
పేజీలు 8







# సంకల్పం సిద్ధిస్తుంది

- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాభివృద్ధి
- శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి
- తెలుగుజాతి నెంబర్-1 అవుతుంది
- స్వార్థంతో తల్లికీ, చెల్లికి ఆస్తులివ్వని వ్యక్తులున్నారు
- తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఉగాది వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీటీడీ, వ్యవసాయ శాఖల పంచాంగాలను ఆవిష్కరించిన సీఎం
- ఉగాది వేడుకల్లో పంచాంగపఠనం చేసిన మాడుగుల నాగఫణిశర్మ

వివరాలు 2లో




ఉదయభాను వ్యాఖ్యలపై

# కూటమిలో దుమారం

**సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు**

**కూటమి నేతలను రెచ్చగొట్టే విమర్శలు మానుకోవాలంటూ హితవు**

జగ్గయ్యపేట, మార్చి 19, మేజర్ న్యూస్ : జగ్గయ్యపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అధికార 2



# ఉగాది కానుకగా

## యువతకు జాబ్ క్యాలెండర్

- యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు

వివరాలు 7లో

భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు

# ఎంతో గొప్పవి

పరమత సహనం పాటిస్తూ వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం మేజర్ న్యూస్ : భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, పరమత సహనం పాటిస్తూ వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

2లో

# సంకల్పం సిద్ధిస్తుంది









విజయవాడ, మార్చి 19, మేజర్ న్యూస్ : స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికలతో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథాన నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2047 నాటికి తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఉగాది పచ్చడి ప్రసాదాన్ని సేవించిన అనంతరం మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం చేశారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. ఉగాది పచ్చడి మన జీవితాలను ప్రతిబింబిస్తుందని.. షడ్రుచుల తరహాలోనే జీవితంలో కష్ట సుఖాలు ఉంటాయని ముఖ్యమంత్రి అన్నారు.

**విదేశాల్లో మన సంస్కృతికి తెలుగువారే బ్రాండ్ అంబాసిడర్లు**

సమీప భవిష్యత్తులో పూర్తిస్థాయి సాంకేతికతతో పాలన జరిగే అవకాశం ఉంటుందని, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇలా వేర్వేరు పరిస్థితులు అప్పటికప్పుడు అధ్యయనం చేసి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చేసిందన్నారు. 30 ఏళ్ల క్రితమే తాను ఐటీ విప్లవాన్ని ఊహించి టెక్నాలజీని ప్రోత్సహించానని తద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వచ్చిందని అన్నారు. నాడు తీసుకున్న నిర్ణయంతోనే హైదరాబాద్ ఇప్పుడు నాలెడ్జి ఎకానమీగా ఎదిగిందన్నారు. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సెంటర్ల గురించి చర్చిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు నేర్పే విలువలను గౌరవించాలని.. ఇక్కడ ఉండే మనకంటే విదేశాల్లోని ప్రవాస తెలుగు వారు వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టటమే తన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేం దుకు సంజీవని ప్రాజెక్టు ద్వారా ముఖ్యమైన ముందడుగు వేశామన్నారు. 2024 కంటే ముందు ఎవరూ సంతోషంగా పండుగలు జరుపుకునే పరిస్థితి లేదని.. ఒక వ్యక్తి కారణంగా ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయని ఆక్షేపించారు. మన దేశంలో ఉమ్మడిగా అంతా కలిసి ఉండే సంప్రదాయం ఉందని.. కొందరు స్వార్థంతో తల్లికి, చెల్లెలికి ఆస్తులు ఇవ్వని వ్యక్తులు కూడా ఉన్నారని సీఎం అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గా ఏర్పడి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య భద్రత అందించాలన్నది లక్ష్యమని తెలిపారు. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీతో మళ్లీ మన జనాభా పెంచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే తల్లికి వందనం ద్వారా ఎంతమంది ఉన్నా ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు వివరించారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను, స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ 56 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దివ్యాంగశక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత ప్రయాణంతో ఆత్మగౌరవాన్ని కల్పించటంతో పాటు డబ్బులు ఆదా అయ్యేలా చేస్తున్నామని వివరించారు. అర్చకులకు రూ.15 వేల వేతనం ఇవ్వటంతో పాటు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు.

**రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి- ప్రజలకు సుఖ శాంతులు : మాడుగుల నాగఫణిశర్మ**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజయం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం సంకల్పించిన ప్రతీదీ ఫలిస్తుందని స్పష్టం చేశారు. తెలుగు వారు ఏ రంగంలో ఉన్నా అగ్రస్థానంలో ఉండాలన్న ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యంగా ప్రజాహితంతో ముందడుగులు వేస్తాయని వెల్లడించారు. లగ్నాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంటుందని.. అందుకే ఉగాదికి ముందుగానే కురిసిన వర్షం దీనికి సూచిక అని తెలిపారు. ప్రత్యేకంగా ఈ ఏడాది సాంస్కృతిక చైతన్యం కలుగుతుందని వివరించారు. అమరావతి విశ్వనగరిగా ఎదుగుతుందని.. రాష్ట్రానికి ప్రభుత్వానికి ఆర్థిక ప్రగతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి విఘ్నాలు లేకుండా సుఖ శాంతులతో ఉంటారని వివరించారు. పంచాంగ పఠనం చేసిన బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మను సీఎం నూతన వస్త్రాలతో సత్కరించారు. అనంతరం టీటీడీ పంచాంగం, వ్యవసాయ పంచాంగంతో పాటు సాంస్కృతిక శాఖ క్యాలండర్లను సీఎం ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో విశిష్ట కృషి చేసిన కళాకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది పురస్కారాలు అందించారు. సాహిత్యం, సంగీతం, కళలు, సామాజిక సేవ రంగాల్లో ఉగాది కళారత్న పురస్కారాలను సీఎం అందించారు. 38 మందికి కళారత్న, 122 మందికి ఉగాది పురస్కారాలను సీఎం చంద్రబాబు అందజేశారు. వివిధ దేవాలయాలకు చెందిన పురోహితు లను సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయ ణ రెడ్డి, కందుల దుర్గేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవి



(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. గురువారం ఉదయం నగరంలోని బచ్చుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం లో జిల్లా యంత్రాంగం తరపున దేవాదాయ ధర్మాదా య శాఖ ఆధ్వర్యంలో శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ డిఆర్ఓ చంద్రశేఖర రావులతో కలిసి జ్యోతి ప్రజ్వ లన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్నా న్నారు. రాష్ట్రంలో చక్కటి అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఉగాది అంటే కొత్త సంవత్సరం మొదటి రోజని, మనం గతంలో ఏమి నేర్చుకున్నాము అందులో మంచిని తీసుకుని భవిష్యత్తులో కూడా మంచిగా మనందరం ఎదుగుతూ మన చుట్టూ సమాజంలో ప్రతి ఒక్కరినీ కూడా ఎదిగే దానికి తోడ్పాటు అందించాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెంది అందరికీ ఉద్యోగ అవకాశాలు రావాలన్నారు రాజధాని అమరావతి పోలవరం ప్రాజెక్టు త్వరగా నిర్మాణం పూర్తి కావాలన్నారు తద్వారా ప్రజలకు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరు తాయన్నారు సుభిక్షంగా ఉంటుందని తొలుత విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం వేడుకలకు విచ్చేసిన అతిధులు, ప్రముఖులకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. తదుపరి ఆహుతులైన అందరికీ ఉగాది పచ్చడి వితరణ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అతిథులు, ప్రముఖులకు ఘనంగా సత్కారం జరిగింది అనంతరం దేవాదాయ శాఖలో విశిష్టంగా సేవలు అందించిన 10 మంది వేద పండితులు, అర్చక స్వాములకు 10,116 రూపాయలు నగదు పురస్కారంతో పాటు, శాలువా, పండ్లు నూతన వస్త్రాలతో మంత్రి, జిల్లా కలెక్టర్, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. తదనంతరం యోగా గురువులు కవి పుంగవులు ముదిగొండ శాస్త్రి నేతృత్వంలో కవులు రచయితలు చింతలపాటి మురళీకృష్ణ మేరీకృపాబాయి, వోలేటి ఉమా సరస్వతి, వక్కలంక రామకృష్ణ, సింహాద్రి పద్మ, బత్తిన అగస్త్యేశ్వర రావులతో కలిసి నిర్వహించిన కవి సమ్మేళనం అందరిని ఆకట్టుకుంది. అలాగే చిన్నారి విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. తదుపరి కవులను, సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అతిథులు, ప్రముఖులు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డిఓ సాంబశివరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణి కుమార్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంస్థ డైరెక్టర్ హసీం బేగ్, జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు, శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో ఆకుల కొండలరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్థానిక నాయకులు వెంకటస్వామి, పుల్లయ్య పలువురు దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉదయభాను వ్యాఖ్యలపై కూటమిలో దుమారం

(మొదటిపేజీ తరువాయి)



తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి సిద్ధాంతాల ప్రకారం నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేన బిజెపి అన్నదమ్ముల కలిసికట్టుగా పార్టీని నియోజక వర్గంలో గెలిపించుకుంటే అటువంటి కూటమి ప్రభుత్వంలో ఓటమిపాలైన ఉదయభాను చేరి పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించటం నియోజకవర్గంల కలకలం రేపుతుంది. కూటమి నాయకుడు ముసుగులో ఉన్న వైసీపీ నాయకుడిలా వ్యవహరిస్తున్నట్లుగా ఉదయభాను తీరు ఉంది అని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి నాయకులు అన్నదమ్ముల కలిసి ఉంటే వారి మధ్య విధంగా 2024 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి ఓటమి పాలైన ఉదయభాను రాష్ట్రంలో వైసీపీ అధికారాన్ని కోల్పోవడంతో తన అవినీతి అక్రమాలను బయటికి తీసి కేసులు పెడతారని భయపడిన భాను తన రాజకీయ మనుగడ కోసం అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసమే జనసేనలో చేరడం జరిగిందని అలాంటి వ్యక్తి భయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అని కొందరు రాజకీయ నాయకులు చెవులు కొరుకుంటున్నారు. అల్లరి చిల్లరి రాజకీయాలు మానుకోవాలని ఇప్పటికే తన గుండా రౌడీ రాజకీయాలకు ప్రజలు స్వస్తి పలికారని అయినప్పటికీ ఆయన తీరు మారకపోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో కూటమినేతలను సమన్వయంతో రాగాద్వేషాలకు తావివ్వకుండా నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీ రామ్ తాతయ్యకు నియోజకవర్గ ప్రజలు మద్దతు తెలుపుతుంటే అది చూసి ఓర్వలేని ఉదయభాను అక్కసుతో ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు అని వారు అన్నారు. ఎన్నికల బరిలో జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీరాం రాజగోపాల్ చేతిలో మూడు సార్లు ఓటమిపాలైనప్పటికీ విజ్ఞత లేకుండా కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదు అని నియోజకవర్గంలో ప్రజల ఆదరణ కోల్పోయిన ఉదయభానుకు మతిభ్రమించిందని అందువల్లనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ నియోజకవర్గం లోని తెలుగుదేశం జనసేన బిజెపి నాయకుల మధ్య గొడవలను సృష్టిస్తూ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయడం జరుగుతుందని అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషంగా ఉందని కొందరు భావిస్తున్నారు. కేవలం కూటమి ప్రభుత్వం లో ఉన్న తెలుగుదేశం జనసేన బిజెపి నాయకుల మధ్య చిచ్చు పెట్టడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఉదయభాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు. తన తీరు మారకపోతే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని హెచ్చరించారు. వైసీపీ తరపున పోటీ చేసి ఓటమిపాలైన నీకు నియోజకవర్గంలో ఎందుకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు. కూటమి పార్టీ గెలుపు కోసం నీవు ఏమైనా కృషి చేశావా.. ..?కూటమి ప్రభుత్వం గెలిసిన తర్వాత నీ స్వార్థం కోసం నిన్ను నమ్ముకున్న వైసీపీ కార్యకర్తలను నట్టేట ముంచేసి జనసేనలో చేరిన నిన్ను నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ నమ్మరని ఇప్పటికే నీ రాజకీయ భవిష్యత్తు అంధకారంగా మారిందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు హోదాలో ఉండి ఇలాంటి కుట్రపూరిత వ్యాఖ్యలు చేయటం మానుకోవాలని కూటమి నాయకులు కోరారు.

# ఘనంగా తెలుగుజాతి పరిరక్షణ సమితి ఆవిర్భావ కార్యక్రమం



**విజయవాడ మేజర్ న్యూస్ :** బందర్ రోడ్ లోని బాలోత్సవ భవన్లో తెలుగుజాతి పరిరక్షణ సమితి ఆవిర్భావ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపపతి ఆచార్య డి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితుల వల్ల మన సంస్కృతి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం ప్రకారం ప్రాథమిక స్థాయి నుండి డిగ్రీ వరకు మాతృభాషలోనే బోధన సాగాలని, ముఖ్యంగా మెడిసిన్ ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో కూడా తెలుగు మాధ్యమంలో పుస్తకాలు అందుబాటులోకి రావాలని కోరారు. పంచాయతీ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసి దైనందిన వ్యవహారాల్లో తెలుగు వాడకాన్ని పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుజాతికి ఘనమైన చరిత్ర ఉందని ఒకప్పుడు 8 రాష్ట్రాలకు ముఖ్యమంత్రులను అందించిన ఘనత తెలుగు వారికే దక్కుతుందన్నారు. అలాంటి తెలుగు భాష నేడు నాలుగో స్థానానికి పడిపోవడం పై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఉపాధి కోసం ఇతర భాషల పై మోజు పెంచుకుంటూ సొంత భాషను నిర్లక్ష్యం చేయడం భావ దారిద్ర్యమని ఆయన విమర్శించారు.

ఎన్టీఆర్ తర్వాత తెలుగు భాషను ప్రోత్సహించే సరైన నాయకత్వం కరువైందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగుజాతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు అన్నాబత్తుని సదాశివరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తెలుగు వారందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు తెలుగు గడ్డపై ఇతర రాష్ట్రాల ప్రజల ఉపాధి పొందుతున్నప్పుడు మనవారు మాత్రం పర భాషల కోసం ప్రాకులాడడం సరికాదని,మన అస్థిత్వాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు భాషను పరిరక్షించు కోవాలనే ఉద్దేశంలో భాగంగానే తెలుగుజాతి పరిరక్షణ సమితి ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహా సభ సభ్యులు పి వి వరప్రసాద్, మహారాష్ట్ర ఆలిండియా కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాధా మోహన్, తమిళనాడు రాష్ట్రేతర తెలుగు సమాఖ్య చైర్మన్ ఎ వి సీతారామయ్య, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య చైర్మన్ రాళ్ళపల్లి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల పట్ల హర్షం ప్రకటిస్తున్నాం



**విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

**ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం**

**ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** నిరుద్యోగులు ఎప్పటి నుండో ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్ ఉగాది కానుకగా విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తరపున హర్షం ప్రకటిస్తున్నాం, నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ 10,060 పోస్టులతో ఉన్నత విద్యా, గ్రూప్ వన్, గ్రూప్ టు, హోం శాఖ, విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు, ఇంటర్ విద్యకు సంబంధించి పూర్తి సమాచారంతో జాబు క్యాలెండర్ విడుదల చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగులకు ఏ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో అనే స్పష్టమైన సమాచారం ఉండటం వలన ప్రణాళిక బద్ధంగా ప్రిపరేషన్ కొనసాగించడానికి వీలుంటుంది కాబట్టి నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఒక వరం లాంటిది ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకొని తన నిబద్ధతను నిరూపించుకున్న నారా లోకేష్‌కి నిరుద్యోగులు పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థకు ప్రాణం పోస్తూ జాబు క్యాలెండర్ ప్రకటన విద్యా వ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థ నాణ్యత పెరగడానికి దోహదపడుతుందటంలో సందేహం లేదు దాదాపు 20 సంవత్సరాల తర్వాత విశ్వవిద్యాలయాల్లో పోస్టులు భర్తీ చేయడం శుభసూచకమని, విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులు లేక విశ్వవిద్యాలయాలు కలతప్పుతున్న ఈ తరుణంలో జాబు క్యాలెండర్ ద్వారా విశ్వవిద్యాలయాలకు పునరవైభవం వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

గ్రూప్ వన్ గ్రూప్ టూ ఉద్యోగాలు కల్పన ద్వారా పరిపాలన సౌలభ్యం పెరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు వేగంగా అందుతాయి, ప్రభుత్వ సేవలు మరింత వేగంగా ప్రజలకు అందుతాయని, రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువత జాబు క్యాలెండర్ సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడాలని కోరుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ సంఘం ముఖ్య నాయకులు నారా లోకేష్‌కి ప్రత్యేక కృతజ్ఞత ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జక్క శ్రీనివాసరావు, సందీప్, ఎల్ల బాబు, ఆకునూరు సుబ్బారావు, వీరబాబు, కుమార్ రాజా మొదలైన వారు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కాలచక్ర డైరీ 2026-27 ఆవిష్కరణ



**విజయవాడ మేజర్ న్యూస్ :** పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కాలచక్ర డైరీ 2026-27 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరై, కాలచక్ర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాలచక్ర డైరీనీ రచించిన వారు డాక్టర్ మానే పల్లి వి.వి.ఎస్. ఎన్. మూర్తి, ప్రస్తుతం ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తూ, నిరుద్యోగ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా, అలాగే బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డైరీ విశిష్టత గూర్చి మాట్లాడుతూ, “కాలచక్ర డైరీ అనేది కేవలం రోజువారీ తేదీల సమాహారం మాత్రమే కాదు. ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కాలగణన, ఆధ్యాత్మికతను ప్రతిబింబించే ఒక ప్రత్యేక గ్రంథం“ అని పేర్కొన్నారు. ఈ డైరీ ద్వారా పండుగల ప్రాముఖ్యత భారతీయ కాలగణన విధానం ఆధ్యాత్మిక మార్గదర్శక సమాచారం ప్రతి ఇంటికి చేరేలా రూపొందించబడినదని తెలిపారు. రసలింగేశ్వర పీఠం విశేషాలు విజయవాడ మొగల్రాజపురంలో ఉన్న “శ్రీ శ్రీ నారికేళ సహిత మహా రసలింగేశ్వర మహా పీఠం“ ఈ డైరీ రూపకల్పనకు ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచిందని నిర్వాహకులు వివరించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ పీఠం 102 సంవత్సరాల వైభవాన్ని పూర్తి చేసుకుందని, ఇది భక్తి, సంప్రదాయాల పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా పాదరస లింగం ఈ పీఠానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదిస్తోందని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సంస్కృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక విలువల అభివృద్ధి, సనాతన ధర్మ ప్రోత్సాహం విషయంలో ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు స్వయంగా ఈ డైరీని ఆవిష్కరించడం, భారతీయ సంప్రదాయాలకు పార్టీ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. “పరాభవ నామ సంవత్సర ఉగాది ప్రతి కుటుంబానికి శుభసంకల్పాలు, విజయాలు తీసుకురావాలని, కాలచక్ర డైరీ ప్రతి ఇంటికి చేరి సంస్కృతి వెలుగులు విరజిమ్మాలని ఆశిస్తున్నాము“ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కల్చరల్ యాక్టివిటీస్ ఓబీసీ మోర్చా బిజెపి ఇంచార్జ్ బి శివకుమార్ పట్నాయక్, బిజెపి స్టేట్ సెక్రటరీ పవన్, బిజెపి డిస్టిక్ ప్రెసిడెంట్ ఎన్టీఆర్ జిల్లా అడ్డూరి శ్రీరామ్, బీజేపీ సీనియర్ లీడర్స్ అమ్మోరు శ్రీనివాస్ కట్ట సుబ్బారావు, నగర ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు, పాఖ్యాత రచీతలు, వాస్తు శాస్త్ర నైపుణ్య నిపుణులు,పలువురు అవధానులు, పాల్గొన్నారు.






## ఫ్లిప్ కార్ట్‌లో గేమ్ ఆడండి

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈ ఉగాది... లేదా మీరు యుగాది అంటారా... ఉగాది? యుగాది? ఏదైనా సరే, పండుగ మజా మాత్రం మీ పండుగ అవసరాలన్నింటికీ అద్భుతమైన ఆపర్లు, కేవలం ఫ్లిప్కార్ట్లోనే.ఇప్పుడే “ఉగాది“ లేదా “యుగాది“ అంటూ విష్ చేయండి. వెంటనే మీ ప్రత్యేక పండుగ ఆఫర్లను అన్లాక్ చేసుకోండి. ఫ్లిప్కార్ట్లో గేమ్ ఆడి. ఆఫర్లను గెలుచుకోండి. ఇప్పుడే గేమ్ ఆడండి. https://ugadivsyugadideals.com/

## ఇంటింటికి పంచాంగాలు పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్ :** నాట్య క్షేత్రశీ కూచిపూడిలో నాట్య లెజెండ్ పసుమర్తి రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఉగాది సందర్భంగా శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామిఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించిన సందర్భంగా100 పంచాంగాలనుపంపిణీ చేశారు. ఆయన సోదరుడు దేవాలయ పాలక మండలి ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తి సహకారంతో వీటిని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పంచాంగాలు దేవాలయంలో ఆవిష్కరించారు.

## జూదం ఆడుతున్న ఏడుగురు అరెస్ట్



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదమద్దాలి గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు దాడి నిర్వహించి ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శుభాకర్ పర్యవేక్షణలో సబ్ ఇన్‌స్పెక్టర్ జి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేక సమాచారం మేరకు దాడి చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. వారి వద్ద నుండి 10,600 రూపాయల నగదు, 52 పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేకాట వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇలాంటి కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా వితరణ



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** పేద ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ అభినందనీయమని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అన్నారు. చల్లపల్లి పడమర వీధిలోని జెండాచెట్టు వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు అడపా గురవయ్య, జనసేన నేత ఆడపా రాంబాబుల సహకారంతో పేద ముస్లింలకు రూ.15వేల విలువైన రంజాన్ తోఫా పంపిణీ జరిగింది. రంజాన్ తోఫా కిట్లను సీఐ ఈశ్వరరావు చేతులమీదుగా దాత గురవయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ చాన్ ఖాన్, జన్ను అయ్యప్ప, షేక్ కర్ణం, ఆటో నజీర్ తదితరులు పాల్గొన్నారు. ముస్లిం కుటుంబాలకు ప్రతి ఏటా రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయటం అభినందనీయమని అడపా సోదరులను సీఐ అభినందించారు.

## సీఎం చేతుల మీదుగా.. ఉగాది పురస్కారం అందుకున్న పిఎంఎస్



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రుకు చెందిన పి ఎంఎస్ ప్రసాద్ జర్నలిజం – సోషల్ సర్వీస్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. గురువారం విజయవాడలో జరిగిన ఉగాది వేడుకలలో ప్రసాద్కు అవార్డును అందజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం,10వేల రూపాయల నగదును ప్రసాద్ అందుకున్నారు. ఈ సందర్భంగా పిఎంఎస్ ను పలువురు అభినందించారు.

## అనాథ అంత్యక్రియ ఫౌండేషన్ కన్వీనర్ గడ్డం రాజుకు పురస్కారం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం వారు అనాథ అంత్యక్రియల సేవలకు గాను ఫౌండేషన్ కన్వీనర్ గడ్డం రాజును శాలువాతో సత్కరించి ఉగాది సందర్భంగా ఏర్పాటుచేసిన పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మానేపల్లి కృష్ణమోహన్, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రతినిధులు పెంట శివప్రసాద్, వేద పండితులు ఈశ్వర ఆచార్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## బాలా త్రిపుర సుందరికి త్రిశూల హారతి బహుకరణ



**మొవ్వ మేజర్ న్యూస్:** నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో హారతికోసం 92వేలు విలువచేసే త్రిశూల హారతిని కూచిపూడి గ్రామానికి చెందిన డి. నాగమునిరెడ్డి, నారాయణమ్మ దంపతులు దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షులు ద్వారా అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ కు పరాభవనామ సంవత్సరం ఉగాది పర్వదినాన అందించారు.ఆ దంపతుల మూడవ కుమారుడైన నాగేంద్ర రెడ్డి కి ఇటీవల డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయునిగా ఉద్యోగం రావడంతో తొలి జీతంతో పాటు మరొక నలభై వేలు కలిపి త్రిశూలహారతిని ఉగాది పండగ సందర్భంగా బహుక రించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు జరుపుకున్న ప్రజలు



**పామర్రు మేజర్ న్యూస్ :** నూతన తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలను గురువారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో దేవాలయాలు ఈ సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలలో ఉగాది పచ్చడిని పంపిణీ చేయగా భక్తులు సేవించారు. అలాగే పలు దేవాలయాల్లో ప్రత్యేకంగా పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని నూతన సంవత్సరంలో జరగబోయే విశేషాలను గురించి తెలుసుకున్నారు. ఉంద్రపూడి – పోలవరం అడ్డ రోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కార్య నిర్వహణఅధికారి పివిఎన్ వి ప్రసాదరావు పర్యవేక్షణలో ప్రత్యేకంగా పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పండితులు వేద ఆశీర్వచనం అందించారు. దేవాలయ పాలక మండలి అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మాజీ చైర్మన్ మండపాక శంకరబాబు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి వేడుకల గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే





**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉంద్రపూడి – పోలవరం అడ్డరోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 26వ తేదీ నుండి జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు సంబంధించిన గోడపత్రికలను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆవిష్కరించారు. నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆయన గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, కార్యనిర్వహణాధికారి పివిఎన్వి ప్రసాదరావులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆయన ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. 27న శ్రీ రామనవమి సందర్భంగా ప్రత్యేకంగా సీతారాముల కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 28వ తేదీన మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో పంచాంగం పుస్తకాలను ఎమ్మెల్యే కుమార్ రాజా చేతులమీదుగా భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ ముందుగా పామర్రు నియోజకవర్గ ప్రజలకు, పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి పండుగ ఉగాది అందరూ కూడా భక్తి శ్రద్ధలతో చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ నూతన ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజుకి ఒక పథకం ప్రారంభిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. 21 నెలలలోనే పామర్రుని ప్రగతి పథంలో నడిపించామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, హాస్పిటల్స్, హాస్టల్స్ ఎన్నో నిర్మాణాలు ప్రారంభించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజలందరికీ సంక్షేమం అందిచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ త్వరలోనే తీరుస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరి స్వంత ఇంటి కలను నిజం చేసి చూపిస్తామన్నారు. ఋషుల యాగం చేస్తుంటే రాక్షసులు చెడగొట్టినట్టు పామర్రులో జరుగుతున్న అభివృద్ధి చూసి కొందరు తట్టుకోలేక పోతున్నారని వారిపై ఒకంత అసహనం వ్యక్తం చేశారు. త్వరలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మాజీ చైర్మన్ మండపాక శంకరబాబు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



## భద్రావతి సమేత భావన ఋషి దేవాలయంలో పంచాంగ శ్రవణం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సుపరిపాలన సుస్థిరంగా ఉంటుందని శ్రీ పరాభవ నామ సం" ఘంటసాలలోని శ్రీ భద్రావతి సమేత భావన ఋషిస్వామి దేవాలయంలో తెలుగు పండితులు పిసుపాటి నరసింహారావు ఆలయ చైర్మన్ అందే జగదీష్ ఆధ్వర్యంలో గురువారం పంచాంగ శ్రవణం కావించారు. తెలుగు పండితులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి సుస్థిరపడుతుందని అభివృద్ధి జరుగుతుందని రైతులకు 16 వీసాల పంటలో 9 వీసాల పంట చేజిక్కుతోందని, తెల్ల పంటలు బాగా పండుతాయని, పెసలు మినుములు బాగా పండి ధరలు బాగుంటాయని బంగారము వెండి ధరలు పెరుగుతాయని, మనదేశంలో వర్షాలు కురుస్తాయని, మిశ్రమ ఫలితాలతో ప్రజలందరూ ఆనందోత్సహాలతో ఉంటారని పంచాంగ శ్రవణం కావించారు. విశ్వంశెట్టి దుర్గారావు, గోలి సుబ్బారావు, వక్కలగడ్డ రమేష్, గిల్లి రాంగోపాల్, తాడిపర్తి గౌతం దేవాలయ పురోహితులు గౌతం భక్తులు పాల్గొని పంచాంగ శ్రవణాన్ని ఆలకించినారు.

## దేవాలయాలలో పంచాంగ శ్రవణాలు





**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పలు దేవాలయాలలో గురువారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పరాభవనామ సంవత్సర పంచాంగశ్రవణాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మండల కేంద్రమైన మొవ్వ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దీవి హనుమాన్, వంశీ మోహన్లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మొవ్వ.బుచ్చి రామ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్నా శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పండితులు దీవి రామకృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణాన్నిచేశారు. దేవాలయ పాలక కమిటీ ఆయన సత్కరించి దేవాలయం తరఫున పంచాంగాలను భక్తులకు అందజేశారు. అలాగే వాసవి వనిత క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించి పండితులను సత్కరించారు.

# జనసేన ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

## అమ్మిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 ఆటోలు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ హరిప్రసాద్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ ఉగాది అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. అమ్మిశెట్టి వాసు రాబోయే రోజుల్లో కూడా సామాజిక సేవలో ముందుంటూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో విజయవాడ బందర్ రోడ్ లోని పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. అనంతరం పూజారికాలు నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా అమ్మిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 ఆటోలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ఆటోలను అందజేశారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ ఈ పరాభవ నామ ఉగాది అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచన విధానానికి అనుగుణంగా అమ్మిశెట్టి వాసు తన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా 10 మందికి ఉగాది పండుగ రోజున ఆటోలు పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే సేవాస్ఫూర్తి కనపరుస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ నేత, అమ్మిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఆటో కార్మికులకు 10 ఆటోలను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ బోర్డు చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ రావు, ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, పార్టీ ప్రతినిధులు మల్లెపు విజయలక్ష్మి, కామళ్ల సోమనాథం, బండ్రెడ్డి శివ,అజయ్ వర్మ, షేక్ గయాజుద్దీన్, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక విజయవాడ నగరం



## ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీక విజయవాడ నగరం అని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అందులోనూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సర్వమత సమ్మేళనంతో ఉంటుందన్నారు. పశ్చిమ నియోజకవర్గం 46వ డివిజన్ అల్లినగర్‌లో మస్జీద్ ఏ అలీ మసీదుకు టీడీపీ బిసి విభాగం రాష్ట్ర నాయకులు గుర్రం కొండా నేతృత్వంలో నూతనంగా నిర్మించిన మసీదు ఆర్చిని పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ....పశ్చిమ నియోజకవర్గంలో అన్ని కులాలు,మతాలు వారు కలసి ఉంటారని, మత సామరస్యంకు ప్రతీకగా ఉంటారన్నారు. గడచిన ఎంపీ ఎన్నికల్లో తనకు అత్యధిక మెజార్టీ వచ్చిందంటే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ముస్లీం సోదర, సోదరీమణులే కారణమన్నారు. ముస్లీంలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో విద్యాధరపురం, చిట్టినగర్‌లలో షాదీఖానాల అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకుంటానని, నిధులు కేటాయింపులు చేస్తానన్నారు. ఏ మసీదు అభివృద్ధికైనా తన సంపూర్ణ సహకారం అందిస్తానని వివరించారు. మత సామరస్యంను చాటుతూ తన డబ్బు వెచ్చించి టీడీపీ బీసీ నేత గుర్రం కొండ మసీదుకు ఆర్చి నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, 46 డివిజన్ ప్రెసిడెంట్ పోతినీడు లోకేష్, 47 డివిజన్ ప్రెసిడెంట్ నాగోతి రామారావు, కార్యదర్శి ధనాల శ్రీను,47వ డివిజన్ జనరల్ సెక్రెటరీ కట్టా సాంబయ్య, మైనార్టీ నాయకులు షేక్ అర్షద్, ఫైజాన్, 52 డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉమ్మడి చంటి, 45వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు ప్రెసిడెంట్ పేరం సత్యనారాయణ 52 డివిజన్ ప్రెసిడెంట్ ఈగల్ సాంబ, 51 డివిజన్ అధ్యక్షులు కుంచం దుర్గారావు, నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్ బెవర సాయి సుధాకర్, రెల్లి సంఘం నాయకురాలు తుపాకుల రమణమ్మ, 35 డివిజన్ అధ్యక్షులు షేక్ నంద కుమారి, 50 డివిజన్ అధ్యక్షులు కొప్పుల అరుణశ్రీ, కో క్లస్టర్ ఇన్‌ఛార్జి కొప్పుల గంగాధర్ రెడ్డి, సీనియర్ నాయకులు జగన్మోహన్ రావు, తెలుగు యువత అధ్యక్షులు ఆర్ మాధవ, ఉపాధ్యక్షులు కే భవాని శంకర్, నాయకులు కసిమికోట మల్లేశ్వరి దేవలక్ష్మి తదితరులు పాల్గొనగా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు, నమాజ్, డిన్నర్ కార్యక్రమాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని మసీదు కమిటీ పెద్దలకు, ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# మైనార్టీల విశ్వాసానికి కృతజ్ఞతలు



## తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు రంజాన్ పండుగ ఆహ్లాదకరంగా జరుపుకోవాలని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన ముస్లిం మైనారిటీ సోదరి సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ పాల్గొని ముందుగా ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు, అలాగే తెలుగువారికి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సెంట్రల్‌లోని మైనార్టీ సోదరులందరికీ రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించడం జరుగుతోందని, ప్రతి ఇంట్లో పండుగ ఆనందంగా జరుపుకోవాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని 21 డివిజన్లలో టీడీపీ కూటమి శ్రేణులతో కలిసి విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలకు సహాయం అందేలా ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు ప్రార్థనలు నిర్వహించేందుకు అనుకూల వాతావరణం కల్పించామని.. జిల్లాలోనే అత్యధికంగా సుమారు 78,000 మెజార్టీతో గెలిపించిన మైనార్టీ సోదరుల విశ్వాసాన్ని ఎప్పటికీ మర్చిపోమన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రంజాన్ మాసం ఒక పవిత్ర మాసమని, ముస్లిం సోదరులు ఎంతో భక్తితో ఉపవాసాలు ఉండి ఖురాన్‌లో చెప్పిన మంచి మార్గాలను అనుసరిస్తారని, "మీ ఇంట్లో పెద్ద అన్నయ్యలా ఎప్పుడూ మీకు అండగా ఉంటాం" అని భరోసా ఇస్తూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాగవంశ సాధికార చైర్మన్ ఎరుబోతు రమణరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, 57వ డివిజన్ అధ్యక్షులు షేక్ కబీర్, పార్లమెంట్ కార్యదర్శి షేక్ గౌసియా, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, అప్పలనాయుడు, మాదాల తిరుపతిరావు, బోని నాని, బాడిత మహేష్, మచ్చా ఇమాన్యుల్, వాడ్లమూడి రవి, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా ముస్లిం మహిళలు ప్రార్థన చేసుకోవడానికి ఎమ్మెల్యే చొరవ

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** గురువారం సాయంత్రం సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్ వాంబే కాలనీ వీఎంసీ కళ్యాణ మండపంలో కార్పొరేటర్ కంచి దుర్గ, కంచి ధనశేఖర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు సుమారు 800 మంది ముస్లిం మైనారిటీ కుటుంబాలకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న ఈ సమయంలో వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, నియోజకవర్గంలో సుమారు 10,000 మైనారిటీ కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ ఇంటింటికీ రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని... తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ మైనారిటీలకు అండగా ఉంటుందని, గతంలో కూడా రంజాన్ సందర్భంగా తోఫాలు అందించామని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పార్టీ నాయకులు తమ స్వంత నిధులతో కూడా సహాయం అందిస్తున్నారని తెలిపారు... అలాగే రాష్ట్ర ప్రభుత్వం మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లకు జీతాలు అందజేస్తోందని, మైనారిటీల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయిస్తోందని, ఇక మైనారిటీ సోదరుల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కబరస్థాన్‌ల అభివృద్ధి, కొత్త కబరస్థాన్ స్థలాల ఏర్పాటు, మసీదుల నిర్మాణం, మరమ్మతులు వంటి కార్యక్రమాలు కూడా తమ నాయకత్వంలో చేపట్టామని తెలిపారు. పాత మసీదులను



పునరుద్ధరించడం, అవసరమైన ప్రదేశాల్లో కొత్త ప్రార్థనా మందిరాలను నిర్మించడం ద్వారా ముస్లిం సోదరులకు మెరుగైన సదుపాయాలు కల్పించామని... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పింఛన్ల పెంపు, విద్యకు ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా పలు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని... భవిష్యత్తులో కూడా అల్లాహ్ ఆశీస్సులతో మైనారిటీ వర్గాలు, పేదలు, బీసీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉంటామని బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బేవర సూర్య, ప్రధాన కార్యదర్శి కంచేటి నాగరాజు, ఇంచార్జ్ మల్లేశ్వరరావు, సెంట్రల్ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ గౌస్ బాషా, ధర్మాన రాము, నాగూర్, సుభాని, సలీం, జనసేన నాయకులు నజీబ్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు...

### అకాల వర్షాలతో రైతులకు తీవ్ర ఇబ్బందులు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురైనారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వారంలో పండిన పంట రైతు ఇంటికి చేర్చుకునేవారని గురువారం కురిసిన వర్షాలతో మినుము పంట చేతికొచ్చే టైములో నష్టపోయే అవకాశం ఏర్పడిందన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు రైతులు పరిస్థితి తయారయిందన్నారు. రైతులను ప్రకృతి వెంటాడుతుందనీ. చాలా మంది రైతులు తమ పంటను పోగేసి పరదాలతో కప్పటం జరిగిందన్నారు. మరి కొద్ది మంది రైతులు పంట పనలపై ఉందని. ఈ అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందనీ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు తెలిపారు.

# గంగానమ్మ సేవలో అవనిగడ్డ సిఐ దంపతులు



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు గ్రామ ఎలావేల్పుగా భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి ఉగాది పర్వదిన సందర్భంగా గురువారం అవనిగడ్డ సిఐ యువ కుమార్, కోడూరు ఎస్ఐ చాణిక్య, అవనిగడ్డ ఎస్ఐ శ్రీనివాస్ దంపతులు దర్శించారు, అమ్మవారికి పసుపు కుంకుమ చీర గాజులు పండ్లు పూలు 9 రకాల స్వీట్లు శారీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ధర్మకర్త కోట యుగంధర్ రావు సిఐ, ఎస్సై దంపతులు దుస్సాలువాతో సత్కరించారు.


# ప్రభుత్వ శాఖల్లో 10,060 ఉద్యోగాలు

### ఎంపీటీసీ తాడికొండ చిన్నా



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో యువత భవిష్యత్తుపై గతంలో తీవ్ర నిరాశ నెలకొన్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని రాష్ట్ర తెలుగు యువత నాయకులు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. గత పాలనలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో యువతలో ఆశలు కలిగించి, వాటిని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఆ కాలంలో అవకాశాల కంటే నిరాశ ఎక్కువైందని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని కొనియాడారు. 10,060 పోస్టులతో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఒక కొత్త ఆశను చూపుతోందన్నారు.ఉగాదిన ఇలాంటి భారీ నియామకాల ప్రకటన రావడం నిరుద్యోగులకు నిజమైన పండుగలా మారిందని చిన్నా తెలిపారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తాడికొండ చిన్నా పిలుపునిచ్చారు.

# ఒకటి కాదు రెండు జంట మామిడి



**చల్లపలి మేజర్ న్యూస్:** సాధారణంగా జంట అరటికాయలు కనిపిస్తూ ఉంటాయి. అలాగే తాజాగా జంట మామిడి కనిపించి అందరిని అబ్బుర పరుస్తుంది. చల్లపల్లి పడమర వీధిలోని వేమూరి లావణ్యకు చెందిన ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు కాసిన జంట మామిడి మామిడి కాయ కాయ పలువురిని పలువురిని అబ్బుర పరుస్తోంది. రెండు కాయలు కలిసిపోయి ఉండటాన్ని చూసి పలువురు కొంత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పండగ సందర్భంగా ఉగాది పచ్చడి కలిపేందుకు తమ చిన్న కుమారుడు దరహాస్ కాయను కోశాడని తీరా అది చూస్తే జంటమామిడిగా ఉందని లావణ్య తెలిపారు. తమ చెట్టుకు ప్రతి ఏటా ఇలా జంట మామిడి కాయలు కాయటం సాధారణంగానే జరుగుతుందని ఆమె వివరించారు.



## బొడ్డపాడులో శ్రీ బుద్ధ ధ్యాన కేంద్రం ప్రారంభం

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బొడ్డపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బుద్ధ ధ్యాన కేంద్రంను గురువారం పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. ప్రజల అందించిన విరాళాలు రూ.4 లక్షల వ్యయంతో ఈ ధ్యాన కేంద్రం నిర్మించారు. గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లాతెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాల గోడ పత్రికను పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పేదలకు ఇస్తానన్న వాగ్దానాలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని, భూమిలేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. టిట్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. జీవో నెంబర్ 23న సడలించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దళిత వాడలో స్మశాన వాటికలో ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటిస్థలం, సాగుభూమి సాధనకై ఈ నెల 24 న భారత కమ్యూనిష్టు పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని అడ్డాడ ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు అనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సిపిఐ నాయకులు మాలెంపాటి కోటేశ్వరరావు, పెనుముత్స రాజారత్నం, కొల్లూరి శ్రీధర్, నక్కా శ్రీను, దాసరి చంటి, సిద్ధా బత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్దుల సహకారంతో చలివేంద్రం ప్రారంభం



**మైలవరం, మేజర్ న్యూస్ :** మైలవరం మండలం వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 1987-1992 సంవత్సరాలలో 6 నుండి 10వతరగతి వరకు చదువుకొన్న పూర్వపు విద్యార్ధుల సంఘం సహకారముతో ఉగాది పండుగ రోజు వెల్వడం మెయిన్ సెంటర్, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కచేరి చావిడిలో మంచి నీటి చలివేంద్రం ను ప్రవాస భారతీయులు లకిరెడ్డి చిన్న పుల్లారెడ్డి(యూఎస్ఏ) ప్రారంబించారు. పూర్వపువిద్యార్ధులందరి ఆర్ధిక సహకారంతో గత ఏడు సంవత్సరాలుగా వేసవి కాలంలో చలివేంద్రంను నిర్వహిస్తున్నామని ఇది ఎనిమిదో సంవత్సరమని పూర్వపు విద్యార్ధి సంఘం నాయకులు, రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ & ట్రెజరర్ గూడూరు నాగి రెడ్డి తెలిపారు. లకిరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ మండు వేసవి లో చల్లని మినరల్ వాటర్తో ప్రతినిత్యం ఎంతోమంది దాహార్తి తీరుస్తుండటం ఆనందించతగిన విషయమని పూర్వపు విద్యార్థులందరిని ఏకతాటిపైకి తీసుకొని వచ్చి ఇలాంటి గొప్ప కార్యక్రమము నిర్వహించడంలో గూడూరు నాగిరెడ్డి కృషి అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మాజి సర్పంచ్ శీలం వెంకట రెడ్డి, గ్రామ పెద్దలు లకిరెడ్డి సత్యం రెడ్డి, కడప వీరాంజనేయ రెడ్డి, తోట తిరుపతి రావు, పూర్వపు విద్యార్ధి సంఘం తరుపున ఆనం వెంకటేశ్వర రావు, తాళ్లూరి మురళి, కాటయ్య పలువురు పాల్గొన్నారు. పూర్వపు విద్యార్ధి సంఘం మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాభివృదికి కుడా తోడ్పాటును అందిస్తామని సంఘ ప్రతినిధి గూడూరు నాగి రెడ్డి తెలిపారు. మంచి నీటి చలివేంద్రంను ఏర్పాటు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాటు పూర్వపు విద్యార్థి సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మోసాలు పట్ల అవగాహనతో ఉండండి




**మొవ్వ మేజర్ న్యూస్ :** డ్వాక్రా గ్రూప్ లీడర్ల లో కొంతమంది గ్రూప్ సభ్యుల నుండి వసూలు చేసిన లోన్ డబ్బులను సకాలంలో బ్యాంక్ లకు చెల్లించక మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీస్ దృష్టికి వచ్చిందని, వారి మోసాలకు గురై ఆర్థిక చిక్కుల్లో చిక్కుకోవద్దని కూచిపూడి ఎస్.ఐ సిహెచ్. సురేష్ డ్వాక్రా మహిళలకు సూచించారు. మండల కేంద్రమైన మొవ్వ మండల పరిషత్ కార్యాలయం లో డ్వాక్రా సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూప్ సభ్యులకు తక్కువ వడ్డీకే బ్యాంక్లు లోన్లు ఇస్తుండటంతో, ఎక్కువ మంది లోన్లు తీసుకుంటున్నారని, తిరిగి వడ్డీ, అసలు కట్టే క్రమంలో ఆ డబ్బులను కొంతమంది గ్రూప్ లీడర్లు తమ సొంతానికి వాడుకుంటూ, గ్రూప్ సభ్యులను మోసం చేస్తున్న విషయంపై పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు అవుతున్నాయి. వాస్తవానికి పది మంది ఉన్న గ్రూప్ సభ్యులు, తాము తీసుకున్న లోన్ కి చెల్లించాల్సిన వాయిదా ఒక్కో నెల ఒక్కొకరు, అందరూ కలిసి రొటేషన్ గా డబ్బులను కట్టాల్సి ఉండగా, గ్రూప్ లో ఎవరో ఒకర్ని నమ్మి వారి ప్రతినెలా వారి చేతిలోనే డబ్బులు పెడుతూ, వారు కట్టింది లేనిది పరిశీలించుకోకుండా అతి నమ్మకంతో ఉంటున్నారు. తీరా బ్యాంక్ వారు గుర్తించి నోటీస్ లు పంపేవరకు తమ లోన్ డబ్బులు జమ కాలేదని తెలుసుకోలేక పోతున్నారన్నారు. అప్పుడు పెద్ద మనుషుల్లో పంచాయితీ పెట్టుకొని, అక్కడ కూడా తేలక, పోలీస్ స్టేషన్ కి వచ్చి కేసులు కట్టకుండా డబ్బులు ఇప్పించమని పోలీసులను ఒత్తిడి చేస్తున్నారని, ముందు అలసత్వంగా ఉండి తరువాత బ్యాంకు, పోలీస్ స్టేషన్ ల చుట్టూ తిరగడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. సభ్యులు అందరూ తమ బుక్ కీపర్, వెలుగు సి.సి తో నిత్యం అందుబాటులో ఉంటూ లోన్ బాకీ జమ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని వివరించారు. తద్వారా ఇలాంటి మోసాలకు అవకాశం ఉండదని, అదేవిధంగా సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అనవసర మొబైల్ అప్లికేషన్ లు డౌన్లోడ్ చేసుకోవడంగాని, ఆఫర్ల పేరుతో వచ్చే లింక్ లను టచ్ చేయడం గాని, లోన్ అప్ లలో లోన్లు తీసుకోవడం గాని చేయరాదని సూచించారు. బంగారం ధరలు అమాంతం పెరిగిపోతున్న దృష్ట్యా చైన్ స్నాచింగ్ దొంగతనాలు కూడా ఎక్కువ అవుతున్నాయని, మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉంటూ, నేరగాళ్లుకు అవకాశం ఇవ్వని పద్ధతిలో జాగ్రత్తగా ఉండాలని ఎస్.ఐ సురేష్ డ్వాక్రా మహిళలకు సూచించారు.

## బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీరాం

**పెనుగంచిప్రోలు, మార్చి 19, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో కొనకంచి గ్రామం నుండి నందిగామ మండలం బెల్లంకొండవారిపాలెం వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ రహదారిని డిఎంఎఫ్ గ్రాంట్స్ ద్వారా సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కలగనుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా మెరుగైన రోడ్లు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని అన్నారు.ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామీణ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత కొనకంచి, బెల్లంకొండవారిపాలెం, పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కూడా సులభతరం అవుతుందన్నారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇదిలా ఉండగా, కొనకంచి గ్రామ రైతుల చిరకాల కోరిక అయిన కొనకంచి గ్రామం నుండి బెల్లంకొండవారిపాలెం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయాలనే అభ్యర్ధనను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెట్టెం అనంతరామయ్యగ (90) పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన ప్రతీసారి రహదారి అవసరాన్ని వివరించగా, వారి కోరికను గౌరవిస్తూ అనంతరామయ్య చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయించడం విశేషం.ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## పుట్టి నాగలక్ష్మి రచించిన జంతు తత్త్వ రహస్యాలు పుస్తకావిష్కరణ



**పెడన, మేజర్ న్యూస్:** రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అభివృద్ధి చేసిన మంగళగిరి లైబ్రరీలో నిర్వహించిన తొలి కార్యక్రమం లో గుడివాడకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ప్రముఖ రచయిత్రి పుట్టి నాగలక్ష్మి రచించిన 'జంతు తత్త్వ రహస్యాలు' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ మేరకు ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ జరిగింది. గుంటూరు జిల్లా మంగళగిరి పౌర గ్రంథాలయంలో పరాభవ నామ సంవత్సర మహోత్సవం సందర్భంగా జరిగిన ఉగాది కవి సత్కారాలు కవి సమ్మేళనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు గుంటూరు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమనేని వందనా దేవి ఏపీ గ్రంథాలయ పరిషత్తు సంచాలకులు ఆకేపాటి కృష్ణమోహన్ ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు సంఘ సేవకురాలు కరెడ్ల సుశీల కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లయోలా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. గుమ్మా సాంబశివరావు కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎంతో శ్రమించి పరిశోధించి రచించిన జంతు తత్త్వ రహస్యాలు పుస్తక రచయిత్రి నాగలక్ష్మి నిఘనంగా సత్కరించారు. అలాగే పలువురు కవులు రచయితలు ఉగాది పురస్కార గ్రహీతలు కూడా అభినందించారు.

## గ్రామంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయండి



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు పంచాయితీ పరిధిలో పారిశుధ్య పనులను సక్రమంగా చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రపరచడం వంటి పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య సూపర్వైజర్తో మాట్లాడుతూ కార్మికుల రోజువారీ హాజరు, ప్రతి ఇంటి నుంచి క్రమబద్ధంగా చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రపరచడం వంటి కీలక పనుల్లో మెరుగుదల తీసుకురావాలని ఆదేశించారు. గ్రామంలోని డ్రైనేజీలు, రోడ్లు శుభ్రంగా ఉండాలని, ప్రతిరోజు నియోజకవర్గంలో ఆకస్మిక తనిఖీలు చేస్తానని తెలిపారు. "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం మరింత శక్తివంతం చేయాలని, ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పించడంతోపాటు రోడ్లపై వ్యర్ధాలు వేయకుండా మరింత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా పారిశుధ్య సిబ్బందికి సహకరించి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా వారికి అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎక్కడపడితే అక్కడ రోడ్ల పైన, డ్రైనేజీలలో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. మన గ్రామం, మన బజారు పరిశుభ్రంగా ఉంటేనే అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటాం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పనిచేస్తున్న సిబ్బందిని వారికి ఉన్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్

**యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

**శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు**



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** బి ఆర్ టి ఎస్ రోడ్డు విజన్ 2047 ఆఫీస్‌లో సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల ఉద్దేశించి బోండా ఉమా మాట్లాడుతూ.... యువతకు ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ ప్రకటించింది అని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది.ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగింది. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగింది. శ్రీ ప్రభవ నామ సంవత్సరం కానుక భారీగా ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించింది. శాఖల వారీగా భారీ నోటిఫికేషన్లు జాబ్ క్యాలెండర్లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసం. నేడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయించింది. ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుంది.పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పారదర్శకతకు పెద్దపీట నోటిఫికేషన్ విడుదల నుండి పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశకూ ఈ క్యాలెండర్లో స్పష్టమైన గడువులను ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థులు ఎటువంటి గందరగోళం లేకుండా తమ ప్రిపరేషన్ ను ప్రణాళికాబద్ధంగా కొనసాగించే వీలు కలుగుతుంది అని తెలిపారు "జాబ్ క్యాలెండర్ అంటే కేవలం ప్రకటన మాత్రమే కాదు, అది నిరుద్యోగులకు ఇచ్చే ఒక భరోసా" అనే సదుద్దేశంతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించడం జరిగింది. పారదర్శకంగా, వేగవంతంగా నియామక ప్రక్రియ చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు జరిగిన ఉద్యోగాల కల్పన 1. ప్రభుత్వ ఉద్యోగాలు 30,607 – డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి 2. ఎంఎస్ఎంఈల నుంచి ఉపాధి 2,48,906 3. జాబ్ ఫెయిర్, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1,46,627 4. – 95,174 5. ఫుడ్ ప్రాసెసింగ్ 64,035 6. ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ 13,866 7. పర్యాటక రంగం 5,028 ఈ విధంగా కేవలం 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగింది యువత భవిష్యత్ ను నాశనం చేసిన జగన్ ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అన్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశాడు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టుబడులు తీసుకురాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్ ను నాశనం చేసింది. జగన్ పాలనలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ప్రకారం గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగంతో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. జగన్ పాలనలో విడుదల చేసిన ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఉపాధి లేక 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చంద్రబాబు నాయుడు విద్యార్థి, యువతకు అన్ని విధాల అండగా నిలిస్తే..జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్ ని ప్రశ్నార్థకం చేశారనీ యువతను ప్రోత్సహించి వారిని అన్ని విధాల ఉన్నతంగా తీర్చిదిద్దటమే కోటమీ ప్రభుత్వ జేయమని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## సేవాలో ముందంజలో గీత బంధు సేవా ట్రస్ట్



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండల పరిధిలో గల శ్రీకాకుళంకు చెందిన ఆరేపల్లి రామకోటి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై రామకోటి విజయవాడ వెళుతుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలును కోల్పోయాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపధ్యంలో ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న రామకోటి కాలు కోల్పోవడంతో ఆ కుటుంబం మరింత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్రామస్తుల ద్వారా రామకోటి కుటుంబ ఆర్థిక విషయాలు తెలుసుకున్న గీత బంధు సేవా ట్రస్ట్ నిర్వాహకులు, చల్లపల్లి జడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి స్పందించారు. సేవా ట్రస్ట్ నిర్వాహకులు వీరంకి రంగారావుకు రామకోటి విషయాన్ని కళ్యాణి వివరించారు. గీత బంధు సేవా ట్రస్టు ద్వారా 15 వేల చెక్కును, అలాగే బొల్లా ఫణి బాబు ఆధ్వర్యంలో దివిసీమ గౌడ కౌండిన్య దళం గ్రూపు ద్వారా సేకరించిన 15 వేలు, బీసీ నేత చెన్ను రంగారావు 5 వేల నగదు మొత్తం 35 వేలకు సంబంధించిన చెక్కులను శ్రీకాకుళం గ్రామంలోని రామకోటి గృహంలో గురువారం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు ( చిన్నా ), రాజులపాటి కళ్యాణి చేతుల మీదగా అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరేపల్లి రామకోటి కుటుంబానికి మానవత్వంతో సహాయాన్ని అందించిన వారికి తాడికొండ చిన్న కృతజ్ఞతలు తెలియజేశారు. రామకోటి కోల్పోయిన కాలు స్థానంలో జైపూర్ ప్లాస్టిక్ కాలును గీత బంధు సేవా ట్రస్టు తరుపున అతి త్వరలో అందజేస్తామని రాజులపాటి కళ్యాణి హామీ ఇచ్చారు. జాతీయ మానవ హక్కుల రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, మట్టా వెంకట నరసయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు మురాల శ్రీనివాసరావు, తాతా నాంచారయ్య, మోతుకూరి అంకారావు, చెల్లిముంత శ్రీనివాసరావు, యార్లగడ్డ రుణేశ్వరరావు, ఆరేపల్లి కొండ తదితరులు పాల్గొన్నారు.

## టీవీఎస్ బ్రేక్స్ ఇండియా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాలిటెక్నిక్ విద్యార్థులకు కొలువులు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** టీవీఎస్ బ్రేక్స్ ఇండియా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 24మంది విద్యార్థులకు కొలువులు వచ్చాయి. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ, ప్లేస్‌మెంట్ విభాగ సంయుక్త ఆధ్వర్యంలో టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ ద్వారా క్యాంపస్ డ్రైవ్‌ను బుధవారం గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారని చెప్పారు. ఈ డ్రైవ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తలపడ్డారని అన్నారు. ఈ నియామక ప్రక్రియలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగం నుండి 18మంది, ఎలక్ట్రానిక్స్ విభాగం నుండి ఇద్దరు, మెకానికల్ విభాగం నుండి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.19వేల వేతనంతో ఉద్యోగావకాశం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలో అతిపెద్ద బ్రేక్ సిస్టమ్ తయారీ సంస్థలలో ఒకటైన ఈ సంస్థ దేశీయ ఓఈఎం మార్కెట్‌లో 60% కంటే ఎక్కువ వాటా కలిగి 35+ దేశాలకు ఎగుమతులు చేస్తూ ప్యాసింజర్ వాహనాలు, ట్రక్కులు, ట్రాక్టర్ వంటి విభిన్న రంగాలకు సరఫరా చేస్తూ, ఎలక్ట్రిక్ వాహనాల కోసం కూడా కొత్త బ్రేక్ టెక్నాలజీలు అభివృద్ధి చేస్తోందన్నారు. భారతదేశంలో టాప్ ఆటోమోటివ్ కంపెనీలలో ఒకటిగా వున్నా ఈ కంపెనీలో తమ



విద్యార్థులు కొలువులు సాధించడం హర్షదాయ కమన్నారు. కొలువులు సాధించిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులను, ఈ ప్రాంగణ ఎంపికలు జరగడానికి ముఖ్య కారకులైన ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎమ్.వినయ్‌ని, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించిన విభాగాధిపతులు, అధ్యాపకులను యాజమాన్య సభ్యులు చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, కో సెక్రటరీ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ రాజశేఖర్, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజ నేయులు, అధ్యాపకులు అభినందించారు.

## శాస్త్రోక్తముగా పంచాంగ శ్రావణ కార్యక్రమం

**పెనుగంచిప్రోలు, మార్చి 19, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన ఉదయం గం.9.50ని.లకు దేవస్థాన నిత్య కళ్యాణ మండపంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం వైభవోపేతంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం ఉగాది పచ్చడి, పంచాగములు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, అమ్మవారి భక్తులు తదితరులు పాల్గొన్నారు...

## కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని భట్ల పెనుమర్రు గ్రామంలో గురువారం కూచిపూడి ఎస్. ఐ సి.హెచ్. సురేష్ ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడి చేశారు.కోడి పందేలు వేస్తున్నారనే సమాచారం పై సిబ్బందితో కలిసి దాడి చేయగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రు.21,880/- లు నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్.ఐ సురేష్ తెలిపారు.

## మహిళలకు చీరల పంపిణీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలంలోని కొతవరం చిన హరిజనవాడ రామాలయం వద్ద మహిళలకు ఉగాదిని పురస్కరించుకొని చీరల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి శ్రీ సేవ చైర్మన్ చల్లపల్లి అమర ప్రసాద్ ఆర్థిక సాయం చేశారని రామాలయ కమిటీ చైర్మన్ మద్దాల జగన్ తెలిపారు. కార్యక్రమంలో అర్చక స్వామి శ్రీరామ్మూర్తి, మద్దాల కష్టారావు, భాష తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అవనిగడ్డ గ్రామ దేవత శ్రీలంకమ్మ అమ్మవారి ఆలయ వార్షిక జాతర ఏప్రిల్ నెల ఒకటవ తేదీన నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు గురువారం ఆలయ ఆస్థాన మండపంలో అమ్మవారి వార్షిక జాతర మహోత్సవానికి లగ్నపత్రిక వేద పండితులచే రాయించారు. వేద పండితులు కవిత రామ ఫణి శర్మ లగ్నపత్రిక రాసి ఈవో చేతుల మీదుగా చైర్మన్ కి అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస్ సమితి అధ్యక్షులు మండలి రాజా న్యాయవాది రామిశెట్టి వేణు గోపాలరావు కే డి సి సి బ్రాంచ్ మేనేజర్ చింతలపూడి మధుసూదన్ రావు తో పాటు గ్రామ పెద్దలు పాలకవర్గ సభ్యులు ఆశాదులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొని అమ్మవారు గ్రామోత్సవానికి ముందుగా అమ్మవారి పుట్టింటికి వెళ్ళి పసుపు కుంకుమ చీర సారె అందుకుని అనంతరం గ్రామోత్సవం ప్రారంభం అవుతుందని వివరించారు.

## అవనిగడ్డ పలు ఆలయాల్లో ఘనంగా పంచాంగ శ్రవణం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దివిసీమలోని పలు దేవాలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక గీతా మందిరం, శ్రీ లంకమ్మ అమ్మవారి దేవస్థానం, శివాలయం, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాలతో పాటు మండల పరిధిలోని పులిగడ్డ. వెంకటేశ్వరస్వామి, వేకనూరు సూర్యనారాయణ స్వామి ఆలయాలలో, అమ్మవారి దేవాలయాల్లో వేద పండితులు నూతన సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంవత్సర ఫలితాలు, గ్రహస్థితులు, శుభ ముహూర్తాలు, వ్యవసాయం, వర్షపాతం, ఆర్థిక పరిస్థితులపై వివరాలు తెలియజేశారు. భక్తులు పంచాంగ శ్రవణాన్ని ఆసక్తిగా విని, కొత్త సంవత్సరాన్ని ఆనందంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయాల్లో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులతో కళకళలాడిన దేవాలయాలుఉగాది సందర్భంగా ఆలయాలు పుష్పాలంకరణలతో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు మంగళహారతులతో దేవునికి ప్రార్థనలు చేయగా, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టారు.

# పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

## జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక పాలన అధికారి డీకే బాలాజీ







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పన్నులు సకాలంలో చెల్లించి మచిలీపట్నం నగర అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక పాలన అధికారి డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం నగరంలోని మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థ ప్రత్యేక పరిపాలన అధికారిగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, రెవిన్యూ అధికారి వెంకటేశు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ పాలకవర్గం పరిపాలనా కాలం ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రత్యేక పరిపాలన అధికారిగా జిల్లా కలెక్టర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి అందరికీ విధితమే. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈనెల మార్చి మాసంతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా ప్రజలందరూ వారికి సంబంధించిన పన్నులను అన్నిటినీ చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలన్నారు. ఆ విధంగా చెల్లించిన పన్నులతో నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు వీలవుతుందన్నారు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఇంట్లో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ ఆర్ ఎస్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా అనధికార లేఔట్లలో స్థలం కొనుగోలు చేసి ఉంటే వాటిని నగరపాలక సంస్థలో క్రమబద్ధీకరణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ విధంగా చేయడం వలన వారికి భవిష్యత్తులో బ్యాంకు రుణాలు సజావుగా పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి నగరంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రత, పన్నుల వసూళ్లు తదితర కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సహాయ కమిషనర్ గోపాలరావు పలువురు నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# కళా రత్న అవార్డు అందుకున్న రామమూర్తి



**మొవ్వ మేజర్ న్యూస్ :** భారతీయ శాస్త్రీయ నృత్యమైన నాట్య రంగంలో గత ఐదు శతాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ కూచిపూడి నాట్య ఆచార్యులు, నృత్య దర్శకుడు, నాట్యకళాకారులు హరి.రామమూర్తి గురువారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరాభవ నామ సంవత్సరం ఉగాది పురస్కారాల వేడుకల్లో ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు చేతుల మీదుగా "కళారత్న" అవార్డుని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు హంస విగ్రహాన్ని, 50 వేలు నగదు, ప్రశంసాపత్రం, శాలువాను బహకరించారు. కళా రత్న అవార్డు (హంస)అందుకున్నరామ్మూర్తిని కూచిపూడి నాట్యకళా కారులు పసుమర్తి రత్తయ్య శర్మ, పసుమర్తి రామలింగ శాస్త్రి డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి వెంకట దుర్గా భవాని దంపతులు, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, పసుమర్తి శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి, గ్రంథాలయ పాలకులు వైవిఫణి కుమార్ తదితరులు అభినందించారు.

# నేషనల్ హైవే అధికారులతో ఎంపీ రివ్యూ మీటింగ్

## హాజరైన ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్య



**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ – హైదరాబాద్ ఎన్ హెచ్ – 65 జాతీయ రహదారిని నందిగామ నుంచి విజయవాడ వరకు బైపాస్ రహదారి విస్తరణపై ఆర్‌డబ్లుఎస్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం నిర్వహించారు. బందరు రోడ్డులోని ఆర్ డబ్ల్యుఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఆర్ అండ్ బి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ... విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారి –65 వెంబడి ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో నందిగామ – విజయవాడ మధ్య ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారం దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. ఆ క్రమంలోనే నందిగామ – విజయవాడ మధ్య బైపాస్ రహదారి విస్తరణకు డిపిఆర్ కూడా సిద్ధం అయ్యిందని వివరించారు. అయితే రోడ్ వెడల్పు క్రమంలో సుమారు 500 ఇళ్ళు పోతున్నాయని, కొద్దిమంది రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రైతుల ఇబ్బందులను ఇబ్బందుల్ని నేషనల్ హైవే, ఆర్ అండ్ బి సెక్రటరీ కృష్ణ బాబు దృష్టికి తీసుకెళ్లామని, ప్రజా ప్రతినిధులుగా కొన్ని సూచనలను అధికారులకు చేయడం జరిగిందన్నారు. ఈ సూచనలపై అధికారుల వైపు నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉందన్నారు. పరిటాల సమీపంలో ఉన్న వై జంక్షన్ దగ్గర జాగ్రత్తగా పరిశీలించమని అధికారులను కోరడం జరిగిందన్నారు. ఇబ్రహీం పట్నం దగ్గర పాత హైవే ఎక్కే విధంగా డిజైన్ ని సూచించడం జరిగిందనీ, అధికారులు మాత్రం ఒక్క పరిటాల దగ్గర మాత్రం ఇబ్బందిని పరిశీలించి మళ్లీ డిజైన్ చేస్తామని చెప్పారన్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళతామని ఎంపీ శివనాథ్ తెలిపారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా రహదారి విస్తరణ చేయాలని ప్రస్తుత సమావేశంలో అధికారులకు తెలియజేయడం జరిగిందని, అతి త్వరలో నేషనల్ నేషనల్ హైవే అధికారులు పనులు ప్రారంభించాలని కోరామని వివరించారు.

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... రహదారి విస్తరణ నేపథ్యంలో కాచవరం, చిలుకూరు, మూలపాడు, జూపూడి గ్రామాలకు సంబంధించిన రైతులు భూములు కోల్పోతున్నారని, ఈ క్రమంలో ఉన్న హైవేని విస్తరణ చేయమని కోరినట్లు తెలిపారు. ఉన్న హైవే విస్తరణ చేయడానికి ఒక మైలవరం నియోజకవర్గం పరిధిలోనే 490 నివాస గృహాలు కూల్చాల్సి వస్తుందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బైపాస్ కు అంగీకరించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు.

నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ...బైపాస్ రహదారి విస్తరణ నేపథ్యంలో పరిటాల దగ్గర కొంచెం డైవర్షన్ కోరామని, ఇంతకుముందు భూములు ఇచ్చిన రైతుల్ని మరోసారి ఇబ్బంది పెట్టకుండా కొత్తగా బైపాస్ వేయమని కోరినట్లు చెప్పారు.



# రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం

## ప్రతి నష్టపోయిన రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తా....

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్.

**పెనుగంచిప్రోలు, మార్చి 19, మేజర్ న్యూస్ :** నియోజక వర్గ పరిధిలో ఇటీవల కురిసిన భారీ గాలులు, వర్షాల ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను గ్రామంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సంఘాల నాయకులు, కూటమి నాయకులతో కలిసి దెబ్బతిన్న అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలను పరిశీలిస్తూ రైతుల సమస్యలను తెలుసుకున్నారు. బాధిత రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పంట నష్టం తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకొని, వారి ఆవేదనను వినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరఫున సరైన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, నష్టాల అంచనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి నష్టపోయిన రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రభుత్వం రైతులకు సహాయం అందిస్తుందని రైతులకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, రైతులు, రైతు సంఘం నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో ఘనంగా ఉగాది వేడుకలు



**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏ కొండూరు మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఉగాది సందర్భంగా ప్రత్యేక, పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గడ్డి కృష్ణా రెడ్డి, గడ్డి రోజా రాణి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దంపతులు ఇరువురూ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వీరికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఓంటర్ రామారావు, కుప్పాల బాబు, కొప్పుల లక్ష్మీనారాయణ, తుళ్ళూరు కృష్ణా, ఉప్పెన కృష్ణా రెడ్డి, దాసరి యుగేందర్ రెడ్డి, వీరంకి వెంకటేశ్వరరావు, చోడుబోయన సురేష్,, రామాలయం అయ్యగారు గ్రామ ప్రజలు మహిళలు గ్రామస్తులు, పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999